క్లుప్తంగా

ఆధార్ కేంద్రం వద్ద బారులు



బారులు తీరిన ప్రజలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజలు బారులు తీరారు. శుక్రవారం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆధార్ కార్డులో పుట్టినరోజు, మేల్, ఫీమేల్, వేలి ముద్రలు, ఐరీస్‌లను అప్‌డేట్ చేయించుకోవడానికి వస్తున్నారు. కొంత మంది కొత్తగా చిన్న పిల్లలకు ఆధార్ తీయించడానికి వస్తుండడంతో ఆధార్ కేంద్రం వద్ద సందడి కనిపించింది.

వర్షం కోసం 'కప్పతల్లి'



కప్పతల్లి ఆడుతున్న యువకులు

నేరడిగొండ/ఇచ్చోడ: వర్షాలు సమృద్ధిగా కురువాలని నేరడిగొండ మండలంలోని బుగ్గారం (బి) గ్రామంలో గ్రామస్తులు, ఇచ్చోడ మండల కేంద్రంలో ఫర్టిలైజర్, సీడ్స్ కంపెనీ ఉద్యోగులు కప్పతల్లి ఆట ఆడారు. ఆలయాల వద్దకు చేరుకొని దేవత విగ్రహాలకు జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేసి, వర్షం కురువాలని మొక్కుకున్నారు.

జవాను కుటుంబానికి పరామర్శ

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాను సూర్యవంశీ రాజేశ్వర్ ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బోథ్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు రాథోడ్ బాపురావు శుక్రవారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వాహనాల వేలం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ ఆధ్వర్యంలో పట్టుబడిన పాత వాహనాలకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో రూ 1,28,620 ఆదాయం ఎక్సైజ్‌శాఖకు వచ్చినట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

నార్నూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జవహర్ తెలిపారు. ఎంపీ గోడం నగేశ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరవుతున్నట్లు తెలిపారు. అన్నిశాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోథ్: బోథ్, పొచ్చేర, సొనాలలోని విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రామకృష్ణ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

బోథ్: మండల వ్యాప్తంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, బదిలీ అయిన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై పది రోజులు గడిచింది. ఇంకా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు పూర్తి కాలేదు. దీంతో విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు బోథ్ మండలంలో ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరుతున్నారు.

సీఆర్పీలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాంసి: సక్రమంగా విధులకు హాజరు కానీ సీఆర్పీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా తాంసి, పిప్పల్‌కోటి క్లస్టర్ సీఆర్పీలు విధులకు వెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సక్రమంగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా యోగా దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. అలాగే అధికారులు కూడా ఆయా కార్యాలయాల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు.

- యోగాసనాలు వేసిన విద్యార్థులు, అధికారులు
- ప్రాముఖ్యతను వివరించిన ఉపాధ్యాయులు



బోథ్: యోగా చేస్తున్న సీఐ రమేశ్, సిబ్బంది



ఇంద్రవెల్లి: యోగా చేస్తున్న ఎస్సై, సిబ్బంది



నేరడిగొండ: కేజీబీవీలో..



తాంసి: పొన్నారిలో..

బోథ్: జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో జడ్జి హుస్సేన్, సిబ్బంది యోగాసనాలు వేశారు. యోగాసనాలు వేయడం వల్ల మానసిక, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సీఐ కార్యాలయంలో సీఐ రమేశ్, సిబ్బంది, సొనాల పీహెచ్‌సీలో వైద్యులు నవీన్ రెడ్డి, సిబ్బంది యోగాసనాలు వేశారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌తో పాటు సిబ్బంది యోగా చేశారు. కేజీబీవీ పాఠశాలతో పాటు ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి రజిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలు విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావు మాట్లాడుతూ నిత్యం యోగా చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, వినోద్‌రెడ్డి, నరేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ప్రతిరోజు తప్పనిసరిగా యోగా చేయాలని ఎస్సై దుబ్బాక సునీల్, బయోడైవర్సిటీ బోర్డు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సోన్‌కాంబ్లే గోపినాథ్‌లు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో, వ్యవసాయ మార్కెట్‌యార్డులో యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగాతో అనేక వ్యాధులు దూరం అవుతాయన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో గల 2వ పోలీస్ బెటాలియన్‌లో యోగా దినోత్సవం నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ ఓం ప్రకాష్‌రెడ్డి యోగా దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. బెటాలియన్ కమాండెంట్ పీజేసీ ఛటర్జీ మాట్లాడుతూ శారీరక, మానసిక ఒత్తిళ్లను అధిగమించేందుకు యోగా చేయాలన్నారు. అడిషనల్ కమాండెంట్ జయరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య ఉప కేంద్రాల్లో, పాఠశాలల్లో యోగాసనాలు వేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం యోగా దినోత్సవం సందర్భంగా యోగా గురువు సూర్యప్రకాశ్ వైద్య సిబ్బందితో యోగ చేయించారు. యోగా చేయడం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాగర్, హెల్త్ అసిస్టెంట్ రాథోడ్ కైలాష్, సిబ్బంది పాల్గొన్నారు.



తలమడుగు: యోగా ఆకారంలో విద్యార్థులు



ఆదిలాబాద్‌రూరల్: యోగా చేస్తున్న బెటాలియన్ పోలీసులు

జయశంకర్ సేవలు చిరస్మరణీయం



ఆచార్య జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా, తెలంగాణ ప్రజల సాధికారత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ అని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ చేసిన సేవలను స్మరించుకుని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో ప్రజలు నడవాలన్నారు. కార్యక్రమంలో సుంకిడి ఎంపీటీసీ వెంకట్ యాదవ్, నలిమెల నవీన్ రెడ్డి, నాగరాజు, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఉట్నూర్‌రూరల్: ఉద్యమ నాయకుడు, ఉద్యమ వ్యూహకర్త ఆచార్య కొత్తపెల్లి జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జయశంకర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేందర్, ముజీబ్, బాబా శ్యాం, సాజిద్, సంతోశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జయశంకర్ చౌక్‌లో..

మండల కేంద్రంలోని జయశంకర్ చౌక్‌లో జయశంకర్ వర్ధంతిని నేతకాని సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మహేందర్ నిర్వహించారు. మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి మాట్లాడుతూ.. జయశంకర్ జీవితం తెలంగాణకు అంకితం చేశారని వారి జ్ఞాపకార్థం చౌక్ ఏర్పాటు చేసి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

బోథ్: ఆచార్య జయశంకర్ వర్ధంతి వేడుకలను మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, భీమ బుచ్చన్న, సోలంకి సత్యనారాయణ, జాబీర్, భీంరావు, ఖాదర్ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో జయశంకర్ పదిలం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాల్ అజయ్, సేవ్వ జగదీష్, విజ్జగిరి నారాయణ, కౌన్సిలర్లు వెనుగంటి ప్రకాష్, బండారి సతీష్, పండ్ల శ్రీనివాస్, ధర్మ పాల్, రాంకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా వట సావిత్రి పూజలు



మర్రిచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



పూజలు చేస్తున్న మహిళలు



బేలలో..

ఇంద్రవెల్లి: వట సావిత్ర పౌర్ణిమను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంతో పాటు ముత్నూర్, దనోర(బి), గౌరపూర్, పిప్రి గ్రామాల్లో వట సావిత్రి పూజలు నిర్వహించారు. గ్రామ సమీపంలోని మర్రిచెట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. దారం చుట్టారు. ఈ పూజ చేస్తే భర్తలు సుఖ శాంతులతో, ఆయురారోగ్యాలతో ఉంటారని మహిళలు నమ్మకం.

తలమడుగు: మండల కేంద్రంలో మహిళలు వటసావిత్రి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తలమడుగు శ్రీ వేంకటేశ్వర ఆలయ ఆవరణలో మర్రిచెట్టుకు పూజ చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా వటసావిత్రి వ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని మర్రిచెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. సొనాల గ్రామంలోని రామాలయంలో, బోథ్‌లో ప్రత్యేక పూజలు చేశారు.

బేల: మండల కేంద్రంతో పాటు సిర్సన్న, సాంగిడి, చప్రాల గ్రామాల్లో శుక్రవారం వటసావిత్రి పూజలు చేశారు. మర్రిచెట్టుకు దారాలు చుడుతూ.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబసభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.

ఇచ్చోడ: మండలంలో వటసావిత్రి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు మర్రిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. పూజలు చేశారు. అనంతరం మహిళలు ఒక్కరినొక్కరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో వటసావిత్రి వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మర్రిచెట్టు చుట్టూ దారం చుట్టి మొక్కుకున్నారు. అనంతరం మహిళలు వాయినాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో శుక్రవారం మహిళలు వటసావిత్రి పూజలు చేశారు. సిరికొండ శివాలయంలోని మర్రిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి, దారం చుట్టారు. మహిళ భక్తులతో శివాలయంలో కిటకిటలాడింది.

రోగులకు మెరుగైన సేవలందించాలి



వివరాలు తెలుసుకుంటున్న అధికారి శ్రీధర్

అదిలాబాద్‌టౌన్: డి అడిక్షన్ సెంటర్‌లోని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి మెట్పల్లివార్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల డావ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యపానం మత్తు పదార్థాల పునరావస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోగి పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రోగుల వివరాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ప్రదీప్, రిమ్స్ సైకియాట్రిస్ట్ ఓం ప్రకాష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు గంగనీళ్లతో అభిషేకం



గంగనీళ్లు తీసుకువస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు గంగనీళ్లతో గ్రామదేవతలకు అభిషేకం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవలని, పంటలరు బాగా పండాలని కోరుతూ.. పెన్‌గంగ నదికి డప్పుచప్పులతో బయలుదేరారు. గ్రామస్తులు పెన్‌గంగ నీటిని తీసుకువచ్చి గ్రామంలో హనుమాన్ విగ్రహంతో పాటు పొచ్చమ్మ విగ్రహానికి గంగనీటితో అభిషేకం చేశారు. ప్రతీ ఏటా వర్షకాలం సీజన్‌లో వర్షాలు కురవాలని గ్రామస్తులంతా కలిసి పూజలు చేసి, గంగనీళ్లతో అభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు.

విద్యుత్ స్తంభాలు సరిచేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

బోథ్: మండలంలోని నక్కలవాడ శివారు 20 రోజుల క్రితం ఈదురు గాలులతో కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం 'విద్యుత్ స్తంభాలను సరిచేయండి' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. నేలకొరిగిన స్తంభాలను సరిచేశారు. బోథ్ రూరల్, మర్లపెల్లి, ధన్నూర్, కౌట, కనుగుట్ట, సొనాల రూరల్ ప్రాంతాల్లో ఇప్పటివరకు 54 విద్యుత్ స్తంభాల నేలకొరిగాయని శుక్రవారం వరకు అన్ని విద్యుత్ స్తంభాలను సరి చేసామని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామన్నారు. సబ్ ఇంజనీర్ వెంకటేశ్, లైన్‌మెన్ రమేశ్, జూనియర్ లైన్‌మెన్ గోపి, కిరణ్, మనోజ్, ప్రణీత్ పాల్గొన్నారు.



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

మండల పరిషత్ నిధులతో బోర్లు

బోథ్: బోథ్ మండల పరిషత్ నిధులతో సొనాల గ్రామంలోని రెండు కాలనీల్లో రెండు బోర్లు వేయించినట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. కాలనీవాసులకు నీటి కొరత తీర్చేందుకు బోర్లు వేయించామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

హక్కుల సాధన కోసం పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: కార్మికహక్కుల సాధన కోసం సీఐటీయూ పోరాడుతుందని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం యూనియన్ భవన నిర్మాణానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. భవన నిర్మాణానికి దాతలు విరివిగా వివరాలను అందించాలని కోరారు. నాయకులు దర్శనాల మల్లేశ్, అగ్గిమల్ల స్వామి, గంగన్న, దర్శనాల నగేశ్, పవర్ జితేందర్, పోచన్న, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

సాక్షి స్పందన

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో రోగులకు అందని వైద్య సేవలు అనే కథనం ప్రచురితం కావడంతో స్పందించారు. తేజాపూర్‌లోని బస్తీ దవాఖానాను సందర్శించారు. దవాఖానాలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె వెంట డాక్టర్ ఎండీ సద్దాం, వైద్య సిబ్బంది హరికుమార్ గౌడ్, రాంనరేశ్ ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

హరితహారం విజయవంతం చేయాలి

ఇచ్చోడ: రానున్న రోజుల్లో చేపట్టే హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో మండల వ్యాప్తంగా నిర్వహించనున్న హరితహారం కార్యక్రమాన్ని సమన్వయంగా పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ సర్వేలో వేగం పెంచి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణ్



మర్రిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా ఏరువాక పౌర్ణమి

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో మహిళలు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం ఆలయం ఎదుట ఉన్న మర్రి చెట్టుకు ముడుపులు కట్టి, పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. పాడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. వర్షాలు సకాలంలో కురవాలని పూజలు చేశారు.

'ధర్నా విజయవంతం చేయాలి'



సొనాలలో మాట్లాడుతున్న నాయకులు

బోథ్: ఆదివాసీల హక్కుల కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈనెల 24న ఉట్నూర్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో, సొనాలలో ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఉపాధ్యాయుల భర్తీని చేపట్టాలన్నారు. ఐటీడీఏలో బ్యాక్ లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్వ విశ్వేశ్వర్, పెద్ది సంతోష్, మెస్రం భూమన్న, మారుతి, తదితరులు పాల్గొన్నారు.